## క్లుప్తంగా

### నేటి నుంచి వేంకటేశ్వర ఆలయ బ్రహ్మోత్సవాలు

**కాచిగూడ:** తిరుమల, తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో హిమాయత్‌నగర్ బాలాజీ భవన్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 26వ తేదీ నుంచి 31వ తేదీ వరకు జరుగుతాయి. బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయం వద్ద నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. 27న ధ్వజారోహణం, శేష వాహనం, 28న సూర్యప్రభ వాహన సేవ, 29న శాంతి కల్యాణం, గరుడ వాహన సేవ, 30న రథోత్సవం, అశ్వవాహనం సేవ, 31న చక్రస్నానం, పుష్పయాగం ఉంటుందని టీటీడీ ఉప కార్యనిర్వాహణాధికారి ఎం.రమేష్ బాబు తెలిపారు.

### నేటి నుంచి చిల్డ్రన్స్ సమ్మర్ క్యాంప్

**చిక్కడపల్లి:** బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో బాలబృందావనం పేరిట చిల్డ్రన్స్ సమ్మర్ క్యాంప్ జరుగుతుందని చిక్కడపల్లి బ్రహ్మకుమారీస్ సంస్థ ఇన్‌చార్జ్ జయశ్రీ తెలిపారు. ఈ నెల 26 నుంచి 28వ తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ప్రతి రోజూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు నిర్వహించే ఈ క్యాంప్‌లో పాల్గొనేందుకు 9 నుంచి 14 సంవత్సరాలలోపు వారికే అవకాశం ఉంటుందన్నారు. పాల్గొనేవారు తమపేర్లను ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మరిన్ని వివరాలకు 040–23001234, 8143466670 నంబర్లలో సంప్రదించాలని జయశ్రీ కోరారు.

### నేడు ఇందిరానగర్‌లో డ్రైనేజీ పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన

**నల్లకుంట:** డివిజన్‌లోని ఇంద్రానగర్ బాలాజీ అపార్ట్‌మెంట్ నుంచి గోల్నాక కల్లు కాంపౌండ్ వరకు రూ. 15 లక్షల వ్యయంతో చేపట్టనున్న డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ శుక్రవారం శంకుస్థాపన చేస్తారని బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు మేడి ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి డివిజన్ బీఆర్‌ఎస్ నాయకులు హాజరు కావాలని కోరారు.

### జూన్ 4న పర్యావరణ పరిరక్షణపై 5కె రన్

**కాచిగూడ:** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జూన్ 4న ఆదివారం ఉదయం 6 గంటలకు నెక్లెస్ రోడ్‌లో ఉమర్ అలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్, హైదరాబాద్ ఆధ్వర్యంలో 5కె రన్ నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ ఉమర్ అలీషా, ట్రస్ట్ కన్వీనర్ పి.ఆనంద్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించి, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం ఈ రన్ ముఖ్య ఉద్దేశమన్నారు. పర్యావరణ ప్రేమికులు పెద్ద సంఖ్యలో పాల్గొని రన్‌ను విజయవంతం చేయాలని డాక్టర్ ఉమర్ అలీషా పిలుపునిచ్చారు..

### దోమలగూడ పీఎస్‌కు ఐదుగురు ఎస్‌ఐల కేటాయింపు

**చిక్కడపల్లి:** నూతనంగా ఏర్పాటు చేసిన దోమలగూడ పీఎస్‌కు ఐదుగురు ఎస్‌ఐలను అలాట్ చేస్తూ నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. నాంపల్లి నుంచి గిరి శ్రీకాంత్, చిక్కడపల్లి నుంచి చెన్ను శ్రీనివాస్‌రెడ్డి, గాంధీనగర్ నుంచి కర్నె శ్రీనివాస్ రెడ్డి, ఎస్ఆర్‌నగర్ పీఎస్ స్పెషల్ బ్రాంచి నుంచి డి.శ్రీకాంత్‌గౌడ్, చిలకలగూడ పీఎస్ నుంచి ఎన్.సాయికృష్ణలను దోమలగూడ పీఎస్‌కు కేటాయించారు. కాగా ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని చిక్కడపల్లి పాత పోలీస్ స్టేషన్ భవనంలో దోమలగూడ పీఎస్ ఏర్పాటు కోసం రంగులు వేయడంతో పాటు ఫర్నిచర్ ఏర్పాటు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇప్పటికే దొంతిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం జూన్ 2 నుంచి ఈ పీఎస్ కార్యకలాపాలు ప్రారంభించేలా ఏర్పాట్లు సాగుతున్నట్లు తెలుస్తోంది. కాగా చిక్కడపల్లి ట్రాఫిక్ పీఎస్‌కు సెంట్రల్ క్రైమ్ స్టేషన్‌నుంచి వై.వెంకటశాంతారావును, గాంధీనగర్ పీఎస్ ఎస్‌బీ నుంచి ఎం.కోటేశ్వర్‌రావును చిక్కడపల్లి లా అండ్ ఆర్డర్ పీఎస్‌కు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

### బీసీ బంధు ఇవ్వాలి

**ముషీరాబాద్:** దళిత బంధు తరహాలో బీసీలకు బీసీ బంధు ఇవ్వాలని బీసీ సంక్షేమ సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు మాదేశి రాజేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముషీరాబాద్‌లోని బీసీ సంక్షేమ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చేతి వృత్తులను నమ్ముకుని జీవిస్తున్న బీసీలకు 10 లక్షల రూపాయల బీసీ బంధు పథకాన్ని అమలు చేయాలని కోరారు. సమావేశంలో ముషీరాబాద్ నియోజకవర్గ బీసీ సంక్షేమ సంఘం మహిళా కమిటీ అధ్యక్షురాలు కళావతి, నాయకులు సురేష్ కుమార్, నవీన్‌బాబు, సాయి,రాజేష్ పాల్గొన్నారు.

### అఖిల భారత యౌవనస్థుల కూటములు ప్రారంభం

**చిక్కడపల్లి:** గోల్కొండ చౌరస్తాలోని హెబ్రోన్ చర్చిలో 57వ అఖిల భారత యౌవనస్థుల కూటములు ఘనంగా ప్రారంభమయ్యాయి. గురువారం పెద్ద సంఖ్యలో యువతీయువకులు పాల్గొన్నారు. హెబ్రోన్ సొసైటీ చైర్మన్ జోసెఫ్ పి.కురియన్ పర్యవేక్షణలో పలువురు దేవసేవకులు బైబిల్ పఠనాలు, సాక్ష్యములు, క్రియాపూర్వక ఉపదేశాలు ఇచ్చారు. ఈ నెల 28వ తేదీ వరకు కూటములు జరుగుతాయని, రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు దేశ వ్యాప్తంగా 15 వేల మంది యువతీయువకులు పాల్గొంటున్నారని నిర్వాహకులు తెలిపారు.

## ఆరోగ్యవంత జీవనానికి స్వచ్ఛమైన గాలి అవసరం

**ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్**



కార్పొరేటర్ అమృతతో కలిసి తిలక్‌నగర్ పార్కు సుందరీకరణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

**నల్లకుంట:** ప్రజలు ఆరోగ్యవంతమైన జీవనాన్ని కొనసాగించాలంటే స్వచ్ఛమైన గాలి, వాతావరణం ఎంతో అవసరమని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. కాంక్రీట్ జంగిల్‌లా మారిన నగరంలో రోజురోజుకూ పెరిగిపోతున్న వాయు కాలుష్యం కారణంగా స్వచ్ఛమైన గాలి లభించడం గగనమవుతోందన్నారు. మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ సహకారం, సూచనలతో నియోజక వర్గంలోని ప్రజలకు ప్రకృతి సిద్ధమైన, స్వచ్ఛమైన గాలిని అందించాలనే లక్ష్యంతో నియోజక వర్గంలోని అన్ని పార్కుల్లో యుద్ధ ప్రాతిపదికన సుందరీకరణ పనులు చేపడుతున్నామన్నారు. గురువారం నల్లకుంట డివిజన్ తిలక్‌నగర్ పార్క్‌లో రూ. 44 లక్షలతో చేపట్టనున్న సుందరీకరణ పనులకు స్థానిక కార్పొరేటర్ అమృతతో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎమ్మెల్యే కాకముందు గడిచిన 15 ఏళ్ల కాలంలో నియోజక వర్గంలో ఏ ఒక్క పార్క్ అభివృద్ధికి నోచుకోలేదన్నారు. తాను ఎమ్మెల్యేగా తెలుపొందిన నాలుగున్నరేళ్ల కాలంలో ప్రజల విజ్ఞప్తి మేరకు నియోజక వర్గంలోని పార్కుల సుందరీకరణకు రూ.10 కోట్లకు పైగా నిధులు మంజూరు చేయించానని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే పాదయాత్ర చేసి స్థానికంగా నెలకొన్న సమస్యలు తెలుసుకున్నారు. వీధుల్లో, ట్రాన్స్‌ఫార్మర్ వద్ద గృహనిర్మాణ వ్యర్థాల కుప్పలు పేరుకు పోయాయని స్థానికులు ఎమ్మెల్యేతో మొరపెట్టుకున్నారు. ఇందుకు స్పందించిన ఆయన వెంటనే నిర్మాణ వ్యర్థాలను తొలగించాలని జీహెచ్‌ఎంసీ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డీఈ ప్రవీణ్ కుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్ నరేందర్, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు మేడి ప్రసాద్, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు రమణా నాయుడు, బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు, తిలక్‌నగర్ బస్తీ పెద్దలు పాల్గొన్నారు.

## బీసీ ఉద్యమ చరిత్రలో ఏఎల్ మల్లయ్య స్థానం ప్రత్యేకం

**డాక్టర్ వకులాభరణం కృష్ణమోహన్**



మల్లయ్య విగ్రహాన్ని ఆవిష్కరించి నివాళులర్పిస్తున్న డాక్టర్ వకులాభవరణం కృష్ణమోహన్

**కవాడిగూడ:** దశాబ్దాల పాటు బీసీ వర్గాలు.. ప్రధానంగా మత్స్యకారుల అభ్యున్నతికి ఏఎల్ మల్లయ్య చేసిన సేవలు మరువలేనివని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకులాభరణం కృష్ణమోహన్ కొనియాడారు. మల్లయ్య మరణించే వరకు అవిశ్రాంతంగా ఉద్యమ జీవితం గడిపారని, ఆయనకు అన్ని వర్గాల ప్రజల ఆదరాభిమానాలు ఉన్నాయన్నారు. ఇటీవల మరణించిన ఏఎల్ మల్లయ్య 86వ జయంతి సందర్భంగా గురువారం లోయర్‌ట్యాంక్‌బండ్ ఇందిరాపార్కు సమీపంలో ఏర్పాటు చేసిన ఆయన విగ్రహాన్ని వకులాభరణం కృష్ణమోహన్ ఆవిష్కరించి ఘన నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఏఎల్ మల్లయ్య కేంద్ర ప్రభుత్వం నుంచి అనేక ఉత్తర్వులు తీసుకొచ్చి మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో తొలి ఆనందరామన్ బీసీ కమిషన్ ద్వారా అనేక సమస్యలకు పరిష్కారాలు చూపించారన్నారు. కార్యక్రమంలో మల్లయ్య కుటుంబ సభ్యులు, విమల, అమర్, గంగాధర్, తెలంగాణ మత్స్యకారుల సమఖ్య అధ్యక్షుడు గడప శ్రీహరి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## కులవృత్తులకు సాయం అభినందనీయం



గుజ్జ కృష్ణ

**కాచిగూడ:** రాష్ట్ర ప్రభుత్వం కుల వృత్తులకు అందించే రూ.లక్ష సాయం అభినందనీయమని బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ అన్నారు. కుల వృత్తులకు అందించే రూ.లక్ష పథకాన్ని కేవలం 5 కులాలకే పరిమితం చేయకుండా బీసీ జాబితాలోని 130 కులాలలకు వర్తించేలా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని ఆయన ఓ ప్రకటనలో కోరారు. బీసీబంధు ప్రవేశపెట్టి బీసీలకు ఒక్కొక్క ఇంటికి రూ.10 లక్షలు అందజేయాలని అన్నారు. బీసీ కార్పొరేషన్ ద్వారా స్వీకరించిన పెండింగ్‌లో ఉన్న 5.47 లక్షల దరఖాస్తుదారులకు వెంటనే రుణాలు అందజేసి ఆదుకోవాలని సీఎం కేసీఆర్‌ను ఆయన కోరారు.

## కార్పొరేట్ కాలేజీలను నిషేధించాలి

**బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు రామకృష్ణ**



మాట్లాడుతున్న వేముల రామకృష్ణ

**ముషీరాబాద్:** విద్యార్థులను పీల్చి పిప్పిచేస్తూ ఆత్మహత్యలకు ప్రేరేపిస్తున్న కార్పొరేట్ కాలేజీలను నిషేధించాలని, బీసీ కాలేజీ హాస్టల్స్‌కు సొంత భవనాలు నిర్మించాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం జరిగిన బీసీ విద్యార్థి సంఘ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాలేజీ కోర్సులు చేసే బీసీ విద్యార్థులకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రముఖ కార్పొరేట్ కాలేజీలు పేద విద్యార్థుల నుంచి లక్షలాది రూపాయల ఫీజులు లాగుతూ నిలువు దోపిడీ చేస్తున్నాయని విమర్శించారు. బలవంతపు చదువులతో విద్యార్థులను వేధిస్తూ విద్యార్థుల ఆత్మహత్యలకు ఉసిగొలుపుతున్నారు అన్నారు. రాష్ట్రంలోని 295 బీసీ కాలేజీ హాస్టల్స్‌కు, 321 బీసీ గురుకుల పాఠశాలలకు ఒక్కదానికి కూడా సొంత భవనాలు లేవని, హాస్టళ్లకు కేటాయించిన ప్రభుత్వ స్థలాలను కూడా ప్రైవేట్ సంస్థలకు, వ్యక్తులకు అధికారులు ధారాదత్తం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం నాయకులు హరీష్, శ్రీకాంత్, మహేష్, స్వామి, సాగర్, వేణు, మల్లేష్, భాను, సాయితేజా, సురేష్ పాల్గొన్నారు.

### 'కార్పొరేట్' ర్యాంకుల దాహానికి విద్యార్థి బలి: ఎస్ఎఫ్ఐ

**కాచిగూడ:** డీడీ కాలనీలోని ఓ కార్పొరేట్ కాలేజీలో చదువుతున్న విద్యార్థి ఎంసెట్‌లో తక్కువ ర్యాంకు రావడంతో మనస్తాపానికి గురై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎల్ మూర్తి, రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు అన్నారు. విద్యార్థి మృతికి కార్పొరేట్ కళాశాలల ర్యాంకులు, మార్కుల దాహమే కారణమని వారు ఆరోపించారు. కార్పొరేట్ విద్యా సంస్థలను రద్దు చేయకుంటే విద్యావ్యవస్థ మరింత సంక్షోభంలోకి వెళ్తుందన్నారు. విద్యార్థులకు మార్కులు, ర్యాంకులే జీవితం కాదని, ఎవరూ అధైర్యపడకుండా జీవితాన్ని మధ్యలో ముగించుకోవద్దని ఎస్ఎఫ్ఐ విజ్ఞప్తి చేసింది. తెలంగాణ రాష్ట్రంలో కార్పొరేట్ విద్యా సంస్థలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

## ఎవరెస్ట్ బేస్ క్యాంప్ విజయవంతం



వైద్యులు డాక్టర్ కృష్ణారెడ్డి, డాక్టర్ శోభాదేవి

**కాచిగూడ:** నగరానికి చెందిన ఇద్దరు వైద్యులు డాక్టర్ కృష్ణారెడ్డి (71), డాక్టర్ శోభాదేవి (68) ఎవరెస్ట్ బేస్ క్యాంప్‌ను అధిరోహించేందుకు ఈనెల 6న శనివారం హైదరాబాద్ నుంచి బయలుదేరి వెళ్లారు. ఎవరెస్ట్ బేస్ క్యాంప్‌ను ఈనెల 18న చేరుకుని విజయవంతంగా తమ యాత్రను పూర్తి చేశారు. బేస్ క్యాంప్ యా త్రను పూర్తి చేసుకుని ఈ నెల 23న నగరానికి తిరిగి వచ్చారు. ఈ సందర్భంగా గురువారం కాచిగూడలో వారు మాట్లాడుతూ.. కృషి, పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చన్నారు. ప్రతిఒక్కరూ ఆరోగ్యంపట్ల శ్రద్ధ వహించాలని సూచి ంచారు. పరీక్షల్లో ఫెయిల్ అయితే విద్యార్థులు బాధపడవద్దని, మళ్లీ పరీక్ష రాసి పాస్ కావచ్చన్నారు. క్షణికావేశంలో ఆత్మహత్య చేసుకుని నిండు నూరేళ్ల జీవితాన్ని మధ్యలోనే వదిలేసి తల్లిదండ్రులకు జీవితాంతం క్షోభను మిగల్చవద్దని సూచించారు. శారీరకంగా, మానసికంగా విద్యార్థులు ధైర్యంగా ఉండాలని కోరారు. విజయంతంగా ఎవరెస్ట్ బేస్ క్యాంప్ యాత్రను పూర్తిచేసిన వైద్యులను ఈ సందర్భంగా పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వివిధ పార్టీల నేతలు, విద్యాసంస్థల ప్రతినిధులు, తోటి వైద్య సిబ్బంది ఘనంగా సత్కరించి అభినందించారు.

## ఉపాధి హామీ పరిరక్షణకు ఉద్యమించాలి



మాట్లాడుతున్న గోపాల్‌రావు

**సుందరయ్య విజ్ఞాన కేంద్రం:** జాతీయ, గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ఎత్తివేతకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కుట్రను ఆపకపోతే బీజేపీని గద్దె దించక తప్పదని ఉపాధి హామీ చట్ట పరిరక్షణ కమిటీ హెచ్చరించింది. ఉపాధి హామీ చట్టాన్ని పరిరక్షించాలని పట్టణ పేదలకు ఉపాధి హామీ పనిని ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన రాష్ట్ర సదస్సులో విశ్రాంత ఐఏఎస్ అధికారి టి.గోపాల్ రావు పాల్గొని ప్రసంగించారు. పని హక్కులను కాలరాయడం తగదని, బడ్జెట్‌లో కోత విధించడం దుర్మార్గమైన చర్య అని విమర్శించారు. ఉపాధి హామీ పరిరక్షణకు ఐక్య ఉద్యమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ మాట్లాడుతూ.. గత 8 ఏళ్లుగా కేంద్ర బడ్జెట్‌లో నిధులు తగ్గిస్తూ పథకాన్ని నీరుగారుస్తున్నారని విమర్శించారు. దేశ వ్యాప్తంగా 20 కోట్ల మంది దళితులు 18 కోట్ల మంది గిరిజనులు ఉపాధి హామీ పని వల్ల ఆత్మగౌరవంతో బతకడాన్ని బీజేపీ ప్రభుత్వం జీర్ణించుకోవడం లేదన్నారు. దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ మాట్లాడుతూ.. కూలీలు చేసిన పనికి వారం రోజుల్లో చెల్లించిన వేతనాలు ఆరు నెలలైనా చెల్లించకుండా శ్రమ దోపిడీకి పాల్పడుతున్నారని విమర్శించారు. ప్రతి వారం ఉపాధి హామీ పనులకు సంబంధించిన వేతనాలు చెల్లించడంతో పాటు పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని, చనిపోయిన కార్మికులకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకటరాములు, అధ్యక్షులు బి.ప్రసాద్, మాజీ ఎంపీ అజీమ్‌పాషా, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు జి.నాగయ్య, సీపీఐ రాష్ట్ర నాయకులు బాలమల్లేష్, పీఎంసీ నాయకులు వి.ఎస్.ఆర్.బోస్, శివలింగం, కె.కాంతయ్య, వెంకటమ్మ, రాజేందర్, మీరా సంగమిత్ర పాల్గొన్నారు.

## రేపు అరోరా కాలేజీలో మెగా జాబ్‌మేళా




దరఖాస్తు చేసుకోవడానికి క్యూఆర్ కోడ్‌తో కూడిన పోస్టర్

**చిక్కడపల్లి:** హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో ఈనెల 27న చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆర్టీసీ క్రాస్‌రోడ్ అరోరా కాలేజీలో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఇన్‌స్పెక్టర్ ఎస్.సంజయ్‌కుమార్ తెలిపారు. గురువారం ఆయన స్టేషన్‌లో మాట్లాడుతూ, ఈ జాబ్‌మేళాలో 20కి పైగా కంపెనీలు పాల్గొంటాయని, దాదాపు 2 వేల వివిధ ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. నిరుద్యోగులు ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌స్పెక్టర్ సంజయ్‌కుమార్ కోరారు. పైన బ్రోచర్‌లో క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి అభ్యర్థులు తమ వివరాలు పొందుపర్చాలని ఆయన సూచించారు.

## తనికెళ్లకు ఎన్టీఆర్ అవార్డు ప్రదానం

**చిక్కడపల్లి:** ఎన్టీఆర్ అవార్డుకు తనికెళ్ల భరణిని ఎన్నుకోవడం సముచితంగా ఉందని సీబీఐ విశ్రాంత జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. వంశీ ఇంటర్నేషనల్ శుభాకాంక్షలతో శారదా మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రముఖ నటుడు ఎన్టీఆర్ శతజయంతి సందర్భంగా గురువారం రాత్రి త్యాగరాయగాన సభలో నట, దర్శక, రచయిత తనికెళ్ల భరణికి ఎన్టీఆర్ పురస్కారాన్ని ప్రదానం చేశారు. రేలంగి నరసింహారావు అధ్యక్షతన వంశీ రామరాజు పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో గాయకుడు త్రినాథరావు, దైవజ్ఞశర్మ, నిర్మాత చౌదరి తదితరులు పాల్గొన్నారు. శారద, రేణుక, పవన్, ఫణి తదితరులు మధురంగా పాటలు ఆలపించారు.



తనికెళ్ల భరణికి అవార్డ్‌ను బహూకరిస్తున్న లక్ష్మీనారాయణ తదితరులు

## చికిత్సపొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి

**కాచిగూడ:** రైలు ఢీకొని తీవ్రంగా గాయపడ్డ ఓ వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ వీఎల్ చారి తెలిపిన వివరాల ప్రకారం... డబీల్‌పురా రైల్వే స్టేషన్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి (35) పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొంది. తీవ్రంగా గాయపడ్డ అతడ్ని రైల్వే పోలీసులు ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం అతను మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సంచార జాతులకు మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలి

**రాజస్థాన్ మంత్రి రామ్‌సింగ్‌రావు**



మాట్లాడుతున్న రాజస్థాన్ మంత్రి రామ్‌సింగ్‌రావు

**సుందరయ్య విజ్ఞాన కేంద్రం:** కేంద్ర ప్రభుత్వంతో పాటు ప్రతి రాష్ట్రం సంచార జాతుల అభివృద్ధికి ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని రాజస్థాన్ రాష్ట్ర మంత్రి, జెన్‌కోలాజీ అకాడమీ చైర్మన్ రామ్‌సింగ్‌రావు డిమాండ్ చేశారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర సంచార జాతుల సంఘం ఆధ్వర్యంలో సంచార జాతుల జా తీయ సమ్మేళనం –2023 రెండో రోజు కార్యక్రమం జ రిగింది.ముఖ్యఅతిథిగా హాజరైన రాంసింగ్‌రావు మా ట్లాడుతూ.. సంచార జాతులకు ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించి నిధులను విడుదల చేయాలని కోరారు. సంచార జాతుల యువతీ యువకులకు స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్ నిర్వహించి గ్రాంట్లు మంజూరు చేసి ఉపాధి అవకాశాలు మెరుగుపరచాలన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన నే షనల్ డీఎన్‌టీ కమిషన్ చైర్మన్ బాలకృష్ణ సింధం రేనాకే మాట్లాడుతూ.. భారతదేశ స్వాతంత్ర అమృత మహోత్సవాలు జరుపుకుంటున్న శుభతరుణంలో సంచార జాతుల ప్రజలు జాతీయ సమ్మేళనాన్ని నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ తిరుమలి, తెలంగాణ రాష్ట్ర సంచార జాతుల సంఘం అధ్యక్షుడు నరేందర్, ప్రధాన కా ర్యదర్శి శ్రీనివాస్, యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షు డు యువరాజ్, ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు చెన్నకేశవ్, అధ్యాయన కమిటీ చైర్మన్ వెంకటనారాయణ, అధికార ప్రతినిధి మెన్నెల నాగరాజు, సమన్వాయ కర్త పల్లం సమయ్య, నాగేశ్వర్‌రావు, సునీల్‌తో పాటు 17 రాష్ట్రాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## 'వచ్చే ఎన్నికల్లో అన్ని స్థానాల్లో ఎన్‌డీఎస్‌ఎఫ్ పోటీ'



మాట్లాడుతున్న కూటమి కన్వీనర్ వడ్లమూరి కృష్ణ స్వరూప్

**కాచిగూడ:** వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో జాతీయ ప్రజాస్వామిక లౌకిక కూటమి (ఎన్‌డీఎస్‌ఎఫ్) తెలంగాణలోని అన్ని స్థానాల్లో పోటీ చేస్తుందని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు, జాతీయ ఫ్రంట్ స్టీరింగ్ కమిటీ కన్వీనర్ వడ్లమూరి కృష్ణ స్వరూప్ ప్రకటించారు. నారాయణగూడలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్ వంటి దోపిడీ మాఫియా పార్టీలకు రాజకీయ ప్రత్యామ్నాయంగా జాతీయ ప్రజాస్వామిక లౌకిక కూటమి ఆవిర్భవించిందన్నారు. భాగస్వామిక పార్టీలతో ఉమ్మడిగా ఎన్నికల్లో అభ్యర్థులను పోటీకి నిలబెడతామని ఆయన పేర్కొన్నారు. దళిత సీఎం సాధనే ప్రధాన అజెండాగా ఎన్నికల్లో పోటీ చేస్తామన్నారు. జూన్ 2న తెలంగాణ ఆవిర్భావం సందర్భంగా అంబేడ్కర్ విగ్రహాల వద్ద నివాళులర్పించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వసంతరావు, సంతీష్ కుమార్, శ్రీనివాస్, కరుణాకర్, ప్రవీణ్‌కుమార్, వీఎల్ రాజు, శ్యామ్‌కుమార్, అశోక్ పాల్గొన్నారు.

## జీఓ 111 ఎత్తివేతతో అభివృద్ధి కాదు.. విధ్వంసం

**టీపీసీసీ ప్రధానకార్యదర్శి డాక్టర్ కోట నీలిమ**



మాట్లాడుతున్న డాక్టర్ కోట నీలిమ

**కాచిగూడ:** గండిపేట –హిమాయత్‌సాగర్ జంట జలాశయాల పరిరక్షణ కోసం అప్పటి ప్రభుత్వం తెచ్చిన జీఓ 111 ఎత్తివేతతో అభివృద్ధి కాదు.. విధ్వంసం జరుగుతుందని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోట నీలిమ మండిపడ్డారు. అనంతగిరి కొండల నుంచి రెండు సరస్సులకు నీరు వచ్చే సహజ వ్యవస్థను ప్రభుత్వం విచ్ఛిన్నం చేయడం తప్ప మరొకటి కాదని ఆమె అన్నారు. కాచిగూడ లోని ఓ హోటల్‌లో గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. హైదరాబాద్ నగరానికి తాగునీటి వనరులైన ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ సరస్సులను, వాటి పరివాహన ప్రాంతాలను జీఓ 111 రక్షిస్తుందని, ఈ జీఓ రద్దుతో వర్షాలు వచ్చినప్పుడు భారీగా నీరు పొంగిపొర్లుతుందని, హైదరాబాద్ నగరానికి భారీ వరదల ముప్పు ఏర్పడుతుందని ఆమె తెలిపారు. 111 జీఓను సమర్థిస్తూ 2000 సంవత్సరంలో సుప్రీంకోర్టు సూపర్ ఆర్డర్ ఇచ్చిందని, దాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఎలా ధిక్కరిస్తుందని ఆమె ప్రశ్నించారు. 111జీఓను ఎత్తేస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ ఇదివరకు ఇచ్చిన హామీతో అధికార పార్టీ నేతల అండతో భూఆక్రమణదారులు పేదల నుంచి బలవంతంగా ఈ పరిధిలోని భూములను లాక్కొని సొంతం చేసుకుంటున్నారని ఆమె ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం 111 జీఓ రద్దును తక్షణమే ఉపసంహరించుకోవాలని, లేకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆమె హెచ్చరించారు.

## డివిజన్‌లోని సమస్యల పరిష్కారానికి కృషి

**చిక్కడపల్లి:** డివిజన్‌లోని సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని కార్పొరేటర్ ఎ.పావనీ వినయ్‌కుమార్ అన్నారు. ప్రజల వద్దకే కార్పొరేటర్ కార్యక్రమంలో భాగంగా గురువారం డివిజన్‌లోని ఎస్సార్టీ, టీఆర్టీ క్వార్టర్స్‌లో పర్యటించారు. పేరుపోయిన మట్టికుప్పలను తొలగింపజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య సిబ్బంది కాలనీలు, బస్తీలలో పేరుకుపోయిన చెత్తా చెదారం, మట్టికుప్పలను ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. స్థానికులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బీజేవైఎం నగర మాజీ అధ్యక్షుడు ఎ.వినయ్‌కుమార్, నేతలు రత్నసాయిచంద్, శ్రీకాంత్, ఉమేష్, సురేందర్, లక్ష్మణ్‌యాదవ్, ఆనంద్‌రావు పాల్గొన్నారు.

## ప్రజల్లో చైతన్య స్ఫూర్తి కలిగించిన మాదాల

**సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ**



మాదాల రంగారావు జయంతి సభలో మాట్లాడుతున్న డాక్టర్ కె.నారాయణ

**సుందరయ్య విజ్ఞాన కేంద్రం:** అభ్యుదయ విప్లవ చిత్రాలతో ప్రజల్లో చైతన్య స్ఫూర్తి కలిగించిన నటుడు, నిర్మాత, దర్శకుడు మాదాల రంగారావు అని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ అన్నారు. గురువారం సాయంత్రం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్(ఇప్టా) ఆవిర్భావం సందర్భంగా రెడ్‌స్టార్ మాదాల రంగారావు 75వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇప్టా పతాకాన్ని అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షుడు కందిమల్ల ప్రతాప్‌రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ కె.నారాయణ మాట్లాడుతూ, సమాజంలో వేళ్లూనుకున్న అవినీతి, అన్యాయం, దౌర్జన్యాలు, అణచివేతలు, రాజకీయ దుర్వినియోగం వంటి అంశాలతో మాదాల రంగారావు 1980–90 దశకంలో సామాజిక విప్లవ సినిమాలతో తెరపై సంచలనం సృష్టించారన్నారు. ఎర్ర చొక్కాను సినిమా రంగంలో చూపించి శభాష్ అనిపించుకున్నారని కొనియాడారు. ప్రపంచంలో అతి పెద్ద నటుడు మోదీ అని, ఒక్క రోజు కూడా నిజం మాట్లాడకుండా తన మాటలతో రక్తికట్టిస్తాడని నారాయణ ఎద్దేవా చేశారు. సీపీఐ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూనంనెని సాంబశివరావు మాట్లాడుతూ, కమ్యూనిస్టు ఉద్యమం ఒక్కటిగా ఉండాలని భావించిన గొప్ప వ్యక్తి మాదాల రంగారావు అని అన్నారు. సినీనటుడు డాక్టర్ మాదాల రవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి, సినీ నటుడు మురళీమోహన్, మాజీ ఎంపీ అజీజ్‌పాషా, అరుణోదయ విమలక్క, ఏపీ కార్యదర్శి కె.రామకృష్ణ, ప్రముఖ గాయకుడు వందే మాతరం శ్రీనివాస్, సినీ రచయిత సుద్దాల అశోక్‌తేజ, టీపీఎస్‌కే కన్వీనర్ భూపతి వెంకటేశ్వర్లు, ఎంసీపీఐయూ కార్యదర్శి గాదగోని రవి, సీపీఎం నాయకులు డీజీ నర్సింహారావు, చెరుపల్లి సీతారాములు, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం



ప్రజాసమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్

**ముషీరాబాద్:** ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తున్నామని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. గురువారం ఆయన ముషీరాబాద్ డివిజన్‌లోని రాంనగర్ సెయింట్‌పాల్ స్కూల్ వీధిలో జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... దశాబ్దాల క్రితం వేసిన డ్రైనేజీ పైప్‌లైన్ అస్తవ్యస్తంగా మారడం వల్లే ప్రధాన రోడ్డు కృంగి గుంత పడిందన్నారు. ఆ సమస్యను గుర్తించి వెంటనే కొత్త పైప్‌లైన్ వేయించామన్నారు. అవసరమైన చోట కొత్త పైప్‌లైన్లు వేసిన అనంతరం రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నామన్నారు. నియోజకవర్గంలో ప్రతిరోజూ అధికారులతో కలిసి పాదయాత్రలు నిర్వహిస్తూ తమ దృష్టికి వచ్చిన సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ యువజన విభాగం నగర నాయకుడు ముఠా జైసింహ, ముషీరాబాద్ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకుడు పూస గోరక్‌నాథ్, అరుణ్, శ్రీకాంత్‌గౌడ్, కృపానంద, రవియాదవ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

### బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

**కవాడిగూడ:** భోలక్‌పూర్ డివిజన్ మహాత్మానగర్ బస్తీలో ఇటీవల వేసిన అంతర్గత రోడ్లను గురువారం ఎమ్మెల్యే ముఠాగోపాల్ పరిశీలించారు. మహాత్మానగర్ బస్తీలో పర్యటించిన ఆయన స్థానికులను బస్తీలోని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని భోలక్‌పూర్ డివిజన్ అభివృద్ధికి కోట్ల రూపాయలు కేటాయించిన ఘనత సీఎం కేసీఆర్‌దే అని కొనియాడారు. అనంతరం బస్తీవాసులు ఎమ్మెల్యే ముఠాగోపాల్‌ను, బీఆర్‌ఎస్ నగర యువజన నాయకులు రవీందర్ కోక, ముఠా జైసింహను శాలువాలతో సత్కరించారు. ఆంజనేయులు, శివకుమార్, కృష్ణ, రాజేష్, మల్లేష్, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.